క్లుప్తంగా

ఉద్యోగోన్నతి నియామక పత్రాలు పంపిణీ



నియామక పత్రాలు అందిస్తున్న కరణం వెంకటేష్

చీరాల అర్బన్: చీరాల నియోజకవర్గంలో ఐదుగురు అంగన్‌వాడీ ఆయాల నుంచి టీచర్లుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి నియామకపత్రాలను శుక్రవారం అందించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ చేతుల పదోన్నతి పొందిన వారికి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన వారు అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో మంచి కంటి చూపు సాధ్యం



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న క్లబ్ అధ్యక్షుడు

అద్దంకి: తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి కంటిచూపును పొందవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత గొంగటి సంజీవరెడ్డి, బెల్లంకొండ అంకమ్మరావు సౌజన్యంతో 150 మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, పేరెంట్స్ కమిటీ సుధాకర్‌రెడ్డి, వీరవల్లి సుబ్బారావు, హైదరాబాద్ లెజెండ్స్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహన వంశీ, సెక్రటరీ చంద్రకాశీరాజు, వైస్ ప్రసిడెంట్ డాక్టర్ రారామ్, హెచ్‌ఎం రాఘవరావు, సభ్యులు సాయి హాజరయ్యారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బల్లికురవ: అద్దంకి, సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సుధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతమాగులూరు మండలంలో పాతమాగులూరు ఎస్సీ–1లో కార్యకర్త, కొమ్మాలపాడు మైనారిటీలో, వెల్లలచెరువు మెయిన్ సెంటర్‌లో ఆయా పోస్టులు, బల్లికురవ మండలంలోని కే మల్లాయపాలెంలో ఆయా పోస్టు, యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లి మెయిన్ సెంటర్‌లో కార్యకర్త, యనమదల మెయిన్ సెంటర్‌లో ఆయా, మార్టూరు మండలం నాగరాజుపల్లి మెయిన్‌లో ఆయా, మార్టూరు క్వారీ గుంతలు -2లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

పారా మెడికో శిక్షణ పునరుద్ధరించాలి

వేటపాలెం: గ్రామీణ ప్రాంత వైద్యులకు నిర్వహించిన కమ్యూనిటీ పారామెడికో శిక్షణ తిరిగి పునరుద్ధరించాలని చీరాల డివిజన్ గ్రామీణ ప్రాంత వైద్యులు కోరారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు రోటరీ కమ్యూనిటీ హాల్లో చీరాల డివిజన్‌కి సంబంధించిన ఏడు మండలాల గ్రామీణ ప్రాంత వైద్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంత వైద్యులను గుర్తించి వారికి పారా మెడికో శిక్షణ ఇచ్చారన్నారు. మహానేత అకాల మరణం చెందడంతో శిక్షణ అర్థాంతంగా నిలిపేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం తిరిగి శిక్షణ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం చీరాల డివిజన్ వైద్యుల అసోషియేన్‌కి నూతన అధ్యక్షుడు కాటూరి వర ప్రాసద్, డివిజన్ సెక్రటరీగా యన్నా సుధాకర్, ట్రెజరర్‌గా పచ్చవ రమేష్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

సంచార వాహనాలతో అత్యవసర సేవలు



బల్లికురవలో సంచార వాహనానికి గోపూజ చేసి ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య



పశువైద్యశాలలో మొక్క నాటుతున్న చైతన్య

- సంచార వాహనాన్ని ప్రారంభించిన శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: మూరుమూల ప్రాంతాల్లోని మూగజీవాలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం బల్లికురవ పశువైద్యశాలలో బల్లికురవ, సంతమాగులూరుకు కేటాయించిన సంచార వాహనాన్ని గోపూజతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలకు పశువైద్య సేవలు, పునరుత్పత్తి సేవలు అందుతాయన్నారు. రూ. 241 కోట్లతో 340 సంచార వాహనాలకు కొనుగోలు చేశారని చెప్పారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు 1062 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి రైతు పేరు గ్రామం మండలం జిల్లా పశు అనారోగ్య సమస్య వివరించాలని సూచించారు. సమాచారం వెంటనే సంబంధిత ఆర్‌బీకే కేంద్రానికి చేరుతుందని పశువైద్య సహాయకుడు ఆ ప్రాంతానికి వెళ్లి వైద్యసేవలు అందిస్తారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంచార వాహనంలో పశువైద్య నిపుణులు వచ్చి వ్యాధి నిర్ధారణతో తగిన చికిత్స అందిస్తారని, సేవలను పశుపోషకులు వినియోగించుకోవాలని చైతన్య కోరారు. వైద్యశాలలో మొక్కలు నాటారు.

ప్రహరీలకు శంకుస్థాపన..

కొప్పరపాడు గ్రామంలోని ఎస్సీ, ముస్లిం శ్మశాన వాటికలకు ఎంపీ ల్యాడ్స్‌లో రూ. 17 లక్షల నిధులు ప్రహరీలకు మంజూరయ్యాయి. కృష్ణచైతన్య భూమి పూజ చేసి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, పశుసంవర్ధక శాఖ ఏడీలు మోహన్‌రావు, పద్మావతి, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, పశువైద్యాధికారులు పీ. మహేశ్వరరావు ఆ పావని కుమారి, పీఆర్ ఏఈ జీ. హనుమంతరావు, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, షేక్ శ్రీనువలి చల్లగుండ్ల కోటి స్వామి, మాదాల శివన్నారాయణ, ఈర్తినేని పెద్దన్న, తంగిరాల అయ్యన్న, దివ్వా రామాంజనేయులు, బండి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో సరికొత్త అధ్యాయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న కరణం వెంకటేష్

- 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

చీరాల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం చీరాల పట్టణంలోని 8వ వార్డులోని ఏఆర్ నగర్ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వార్డులోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం వార్డులోని ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అన్నివర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులోని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను కలిసి వారితో మాట్లాడారు. పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కమిషనర్ ఐసయ్య, కో–ఆప్షన్ సభ్యులు షేక్ ఫాతిమా, 8వ వార్డు ఇన్‌ఛార్జి షేక్ మహిమూద్, షేక్ కబీర్, అమీర్, షేక్ అబ్దుల్ సలాం, బాజీ, సామ్యేల్, ఇలియాజ్, ఆర్‌బీకె చైర్మన్ కావూరి రమణారెడ్డి, కౌన్సిలర్లు మల్లెల లలిత, గోలి స్వాతి, మించాల సాంబశివరావు, కె.యానాదిరావు, చీమకుర్తి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలస్వామి బ్రహ్మోత్సవం



గరుడ వాహనంపై ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న మదనగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 6వ తేదీ వరకు రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గురుడ వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణంలో నగరోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పొన్నమాను వాహనంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన 14వ వ్యవస్థాపక ధర్మకర్తలు జక్కా రమేష్, డాక్టర్ జక్కా మోహన మురళీధరరావు, అర్చకులు రావులకొల్లు వెంకటరంగాచార్యులు, రావులకొల్లు చెన్నకృష్ణమాచార్యులు, యాజ్ఞికులు తమిరిశ వంశీకృష్ణలు పాల్గొనగా ఉత్సవాలను దేవాదాయ శాఖ మేనేజర్ శివనాగదాసు పర్యవేక్షించారు.

జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కు పంపిణీ



విద్యార్థి తండ్రికి చెక్ అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అద్దంకి రూరల్: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అద్దంకికి చెందిన సందిరెడ్డి సుకేష్ వరల్డ్ క్విఎస్ ర్యాంకింగ్‌లో 83 వ స్థానం సాధించి అమెరికాలోని విస్కాన్సిన్ యూనివర్శిటి లా కాలేజీలో ఎల్ఎల్ఎం పోస్టు గ్రాడ్యుయేషన్ సీటు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమంలో మొదటి విడత చెక్‌ను అందజేసి విద్యార్థి తండ్రికి కలెక్టర్ విజయకృష్ణన్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాఘవరావు సేవలు మరువలేనివి



రాఘవరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం, వెంకటేష్

- ఎమ్మెల్యే కరణం బలరాం

మేదరమెట్ల: నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు అని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని పమిడిపాడులో పంచాయతీ కార్యాలయం వద్ద రాఘవరావు కాంస్య విగ్రహ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీతినిజాయతీకి మారుపేరని తెలిపారు. సమస్యలు ఎక్కడ ఉన్నా గుర్తించి వెంటనే పరిష్కారం చేశారన్నారు. చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాఘవరావు చూపిన బాటను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాఘవరావు కుమార్తె విక్రమ్ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణ, సర్పంచ్ పాలపర్తి అంజలి, ఎంపీటీసీ సభ్యులు చిట్టినేని నిర్మల, పెనుమాకు అనిల్, సొసైటీ డైరెక్టర్ ఈమని శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు ఎంపీపీగా యల్లమంద



ఎన్నికైన ఎంపీపీ యల్లమందను సన్మానిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, నాయకులు

అద్దంకి: మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా యల్లమంద ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి చీరాల ఆర్డీవో సరోజిని తెలిపారు. ఎంపీపీ అట్లా చిన్న వెంకటరెడ్డి రాజీనామాతో ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో ఇప్పటివరకు వైస్ ఎంపీపీగా ఉన్న ఎనుబర్ల యల్లమంద ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఎన్నికను ఎంపీడీవో సాంబశివరావు అధ్యక్షత నిర్వహించారు. ఈ ఎన్నికలో ఎంపీపీ పదవికి యల్లమంద వైఎస్సార్ సీపీ తరుపున బీ ఫారమ్ పొంది నామినేషన్ వేశాడు. మరో నామినేషన్ ఎవరూ వేయకపోవడంతో యల్లమంద ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి నియామక పత్రం అందజేశారు. యల్లమంద పేరును కామేపల్లి ఎంపీటీసీ కామేపల్లి శ్రీనివాసరావు ప్రతిపాదించగా, మావిళ్లపల్లి ఎంపీటీసీ గడిపూడి విజయభాస్కర్ బలపరిచారు. ఎన్నికకు ముఖ్య అతిథిగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరయ్యారు. సమావేశానికి మొత్తం 16 మంది ఎంపీటీసీలు ఉండగా 13 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో డీఎల్‌డీవో రాజేశ్ పాల్గొన్నారు. ఎన్నికైన ఎంపీపీను కృష్ణచైతన్యతో పాటు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అట్లా చిన్న వెంటకరెడ్డి, మండల నాయకుడు అట్లా పెద వెంకటరెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, నాయకులు ఘనంగా సన్మానించారు.

చేతి వృత్తులను ఆదుకున్న ప్రభుత్వం



సెలూన్‌ను ప్రారంభిస్తున్న బ్రహ్మనందరెడ్డి

చినగంజాం: చేతి వృత్తులు అంతరించిపోతున్న తరుణంలో జగనన్న చేయూత పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలో నిరుద్యోగులైన ముగ్గురు యువకులకు స్థలాన్ని కేటాయించి వారికి వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వారు ఏర్పాటు చేసిన సెలూన్ షాపులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా షాపులు ఏర్పాటు చేసుకున్న యువకులు ఆతం సురేష్, యూ ఆదినారాయణ, ఎం నటరాజ్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టీ శ్రీనివాసరావు, కాపు మున్నం శంకరరెడ్డి, షాకీర్, కిషోర్, సురేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ప్రతినిధులు

జే.పంగులూరు: సృష్టికర్త విశ్వకర్మ భగవానుడి పండుగ సందర్భంగా పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ బ్రాహ్మణుల అభివృద్ధి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పథకానికి కృతజ్ఞతగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘ అధ్యక్షులు టీ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీజేపీ ఆర్టిజన్ సెల్ కన్వీనర్ కే బంగారుబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కౌమార దశ చాలా కీలకం

చినగంజాం: కౌమార దశలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్ విజయ భాస్కర్ అన్నారు. శుక్రవారం పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం దేవదత్తం అధ్యక్షతన 9, 10 తరగతులు బాలబాలికలకు కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కౌమార దశలో బాలబాలికలలో మానసికంగా, శారీరకంగా పలు మార్పులు చోటు చేసుకుంటాయని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిలో వచ్చే మార్పులను బట్టి వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాఘవ, సీహెచ్‌ఓ జీ ఫాతిమా, ఏఎన్‌ఎం సీహెచ్ నాగుల కోటేశ్వరి, ఎంపీహెచ్‌ఏ కే మహేశ్వరరావు, ఆశ వర్కర్‌లు ఎంవీ రమణ, జీ విజయలక్ష్మి, వై సౌజన్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విజేత విద్యార్థులతో ప్రిన్సిపాల్ రజనీకుమారి, పీఈటీ మమత

వేటపాలెం: స్థానిక బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బీ రజనీకుమారి శుక్రవారం తెలిపారు. సింహాచలంలో విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో వివిధ క్రీడాపోటీలు నిర్వహించినట్లు తెలిపారు. క్యారమ్స్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి పి ఎల్లయ్య, కె మోహన్‌సాయి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. హైజంప్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి రామకౌసిక్ తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పీఈటీ మమత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్సైకు అభినందనలు



ఎస్సైను అభినందిస్తున్న నాయకులు

పర్చూరు: పర్చూరు ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న డీ చెంచుప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు కలసి అభినందనలు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, చెరుకూరు సర్పంచ్ పేరం సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్రాకుల కాలేషాలు కలసి ఎస్సై శాలువాతో సత్కరించారు.

కొండాయపాలెంలో రేపు మహా రుద్రాభిషేకం

బల్లికురవ: సమస్త ప్రాణకోటి సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలనే సంకల్పంతో మండలంలోని కొండాయపాలెం గ్రామంలోని గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహారుద్రాభిషేకం చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామ గోవిందు, శివకుమారి దంపతులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాఘ మాసం పౌర్ణమి సందర్భంగా ఉదయం 7 గంటల నుంచి10 గంటల వరకు సహస్ర లింగార్చన, సాయంత్రం 6.30 నుంచి హిమాలయాల సాధువులచే మహారుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని శివానుగ్రహాన్ని పొందాలని ధర్మకర్త కోరారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న డీపీఎంవో

కారంచేడు: కుష్టు వ్యాధిపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహనతో పాటు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని డీపీఎంవో ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం కారంచేడు పీహెచ్‌సీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. శరీరం మీద రాగి వర్ణంలో ఉండే మచ్చలు, మచ్చలపై ఎలాంటి వెంట్రుకలు లేకుండా ఉంటే వాటిని గుర్తించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెచ్‌వీ వసంతవల్లి, హెచ్‌ఎం సాబీరున్నీసా, మెర్సీ, రోజా, రాణి, సలోమీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో భాస్కరరావు, రైతులు

చినగంజాం: పెదగంజాం గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకొని ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని ఏవో కే భాస్కరరావు అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం -2 నందు శుక్రవారం ఒంగోలు ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య వారిచే ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయాధికారి ప్రారంభించారు. కేంద్రం నందు పెదగంజాం, ఆవులదొడ్డి గొల్లపాలెం, కొత్తగొల్లపాలెం, కోడూరి వారిపాలెం, పల్లెపాలెం గ్రామాల రైతులు ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. 2022–23కి గాను వరి ధాన్యం ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ 2060లు, కామన్ రకం రూ.2040లు క్వింటాకు మద్దతు ధర నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించిన గోనె సంచులు, లేబర్ చార్జీలు, రవాణా ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. బయట మిల్లర్లకు, బ్రోకర్లకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో టుబాకో గ్రోయర్స్ సంస్థ తరపున ఎస్ బ్రహ్మయ్య, రైతు భరోసా కేంద్రం అధికారులు డీ మొబీనా, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

అద్దంకి: పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారనే విషయమై తనిఖీలు చేయగా నాగేశ్వర ట్రేడర్స్ దుకాణంలో అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.73,236 విలువ కలిగిన ఎరువులను సీజ్ చేసి, 6–ఏ కేసు నమోదు చేశారు. వెంకటేశ్వర ట్రేడర్స్‌లో లైసెన్స్‌లో నమోదు కాని రూ.1,47,000 లక్షల విలువ కలిగిన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, ఏవో కొత్రపాటి వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.